క్లుప్తంగా

నేడు పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

అడ్డతీగల: మండలంలో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు పాల్గొననున్నారని ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. ఉదయం 10.30 గంటలకు వేటమామిడిలో సచివాలయం నూతన భవనం ప్రారంభిస్తారన్నారు. 11.30 గంటలకు నిమ్మలపాలెంలో మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తారన్నారు. 12.30 గంటలకు తుంగమడుగులలో సచివాలయం నూతన భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. 2.30 గంటలకు డి.రామవరంలో సచివాలయం నూతన భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. 3 గంటలకు దాకోడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు.

ఎంపీపీకి ఎమ్మెల్యే పాల్గుణ పరామర్శ



ఆస్పత్రిలో ఎంపీపీ ఉషారాణిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నాయకులు

అరకులోయ: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఎంపీపీ రంజపల్లి ఉషారాణిని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పార్టీ నేతలతో కలిసి గురువారం పరామర్శించారు. ఎంపీపీకి మెరుగైన వైద్యసేవలు కల్పించాలని అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రి వైద్యులకు ఆయన సూచించారు. వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, నాయకులు శెట్టి వెంకటరావు, మల్లేష్‌నాయక్, తిరుపతి, నర్సింగ్,నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: పోతంగి పంచాయతీ డుంబ్రిగుడ గ్రామానికి చెందిన మండియగురు గోరమ్మ గురువారం ఉదయం మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణలను అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సర్పంచ్‌లు వెంకటరావు, నాగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు, సీనియర్ నాయకులు బాక సింహాచలం, గ్రామ సచివాలయ కన్వీనర్ గణపతి, వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మొద్దు, ఉప సర్పంచ్ జగ్గనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్, పలకలు పంపిణీ



విద్యార్థులకు పంపిణీ చేసిన పలకలు, పెన్నులతో సత్యనారాయణ

కొయ్యూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దుమంతి సత్యనారాయణ అడవి బిడ్డలకు విద్యా దానం పేరిట గురువారం కొయ్యూరు వాల్మీకి వీధిలో 35 మంది విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోనే సమాజం ప్రగతి పథంలో పయనిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ చదవాలని సూచించారు. సర్పంచ్ ఎం. బాలరాజు, దుమంతి కిరణ్, అరవింద్, లోవ రమణ, భాస్కర్, సతీష్, పండు, నాగరాజు, వెంకట్రావు పాల్గొన్నారు.

అమ్మఒడి కోసం ఆస్పత్రిలో వేలిముద్ర



ఆస్పత్రిలో వేలిముద్ర వేయిస్తున్న వలంటీరు

గూడెంకొత్తవీధి: పెదవలస పంచాయతీ చాపరాతిపాలెంకు చెందిన దొండా కుమారి కొద్ది రోజులుగా చింతపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె కుమార్తెకు అమ్మ ఒడి మంజూరు కావడంతో గ్రామ వలంటీరు వేములపూడి ప్రవీణ్ 15 కిలోమీటర్ల మేర దూరం ప్రయాణించి గురువారం అక్కడకు చేరుకుని పథకానికి సంబంధించిన వేలిముద్ర వేయించారు. వలంటీరుకు లబ్ధిదారు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు



వేంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న తణుకు వెంకటరామయ్య విజయలక్ష్మి దంపతులు



రాజవొమ్మంగిలో భజనలు చేస్తున్న సాయిబాబా భక్తులు

రాజవొమ్మంగి: మండలవ్యాప్తంగా వివిధ దేవాలయాల్లో గురువారం తొలి ఏకాదశి పూజలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక వేంకటేశ్వరస్వామి వారి ఆలయం, దుర్గమ్మ గుడి, షిర్డీ సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. షిర్డీ సాయి మందిరాల భారీ అన్నదానం జరిగింది.

అడ్డతీగల: అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రంలో తొలి ఏకాదశి సందర్భంగా గురువారం విశేష పూజలు నిర్వహించారు. క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజాధికాలు జరిపారు. వివిధ రకాల ఫల, పుష్పాలతో స్వామివారిని అలంకరించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. కొండపై కొలువైన లక్ష్మీనారాయణ ఆలయంలో తొలి ఏకాదశి పురస్కరించుకుని అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తొలి ఏకాదశి పర్వదినం విశిష్టతను భక్తులకు తెలియజేశారు. పూజాధికాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



ప్రభుత్వ పథకాలపై వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని కొల్లాపుట్టుపుట్టు పంచాయతీ బిత్రగండ, నందివలస, బిల్లాపుట్టు, బెడ్డగుడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పంచాయతీ సీనియర్ నాయకుడు చిక్కుడు మల్లేష్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఇంటింటికీ వెళ్లి గ్రామ సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిజనుల మేలు కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఎటువంటి సమస్యలున్నా నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, వైస్ ఎంపీపీలు శెట్టి ఆనందరావు లలిత, ఎంపీటీసీ జెమ, సర్పంచ్ రామూర్తి, నాగేశ్వరరావు, మార్కెటింగ్ చైర్మన్ రాజ రమేష్, మార్కెటింగ్ డైరెక్టర్ బిబి స్వారు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మొద్దు, మాజీ ఎంపీటీసీ కృష్ణారావు, బాక సింహాచలం, గ్రామ కన్వీనర్ గణపతి, ఉప సర్పంచ్ జగ్గనాయుడు, నాయకులు మల్లేష్, లింగు తదితరులు పాల్గొన్నారు.

మట్టి రోడ్డు పనులు ప్రారంభం

జి.మాడుగుల: గడుతూరు పంచాయతీ వెదురుపల్లి నుంచి వనమామిడి గ్రామం వరకు రెండు కిలోమీటర్ల మేర మట్టి రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఎంపీపీ కె. పద్మ ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణంతో ఎనిమిది గ్రామాల ప్రజలకు రోడ్డు సదుపాయం కలుగుతుందని ఆమె అన్నారు. గర్భిణులను, రోగులను ఆస్పత్రులకు తరలించటానికి ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె. అప్పలమ్మ, మాజీ ఎంపీటీసీ అప్పారావు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో ప్రజా ధనం వృథా...

ముంచంగిపుట్టు: మండలంలోని మారుమూల రంగబయలు పంచాయతీ కేంద్రానికి వేసిన నూతన రోడ్డు పంచాయతీ రాజ్ అధికారుల నిర్లక్ష్యం వల్లే రూ.17 కోట్ల ప్రజా ధనం వృథా అయిందని బీజేపీ మండలాధ్యక్షుడు వంతాల లక్ష్మణ్ తెలిపారు. వనుగుమ్మ పంచాయతీ నుంచి రంగబయలు పంచాయతీ కేంద్రం మీదుగా జోడిగుమ్మ వరకు వేసిన నూతన తారు రోడ్డు ఇటీవల వర్షాలకు కోతకు గురైంది. గురువారం ఆయన పార్టీ నేతలతో పరిశీలించారు. అధికారుల పర్యవేక్షణ లేక కాంట్రాక్టర్ నాసిరకంగా తారురోడ్డు వేయడంతో పాడైపోయిందన్నారు. చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ నేతలు మత్స్యరాజు, సుభాన్, కామేశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ



విద్యార్థినులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

వై.రామవరం: యార్లగడ్డ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో 300 మంది విద్యార్థినులకు జగనన్న విద్యా కానుక కిట్లను గురువారం పంపిణీ చేశారు. హెచ్‌ఎం మద్దికొండ ఝాన్సీరాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, ఎంఈవో కె. తాతబ్బాయిదొర, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి వీటిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు గతంలో ఏ ప్రభుత్వం అందించలేని సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారన్నారు. అన్ని పాఠశాలలను కార్పొరేటుకు దీటుగా నాడు-నేడు నిధులతో తీర్చిదిద్ది, సకల సౌకర్యాలు కల్పించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు గుడ్ల త్రిమూర్తులు, కరణం కనకరాజు, మంచినీళ్ల నారాయణరావు, మద్దికొండ భారతిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల అందజేత



అగ్నిప్రమాద బాధితురాలికి సహాయం అందిస్తున్న వీఆర్వో, గ్రామపెద్దలు

రాజవొమ్మంగి: పూరిల్లు దగ్ధమై కట్టుబట్టలతో వీధిన పడిన బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున తక్షణ సహాయంగా బియ్యం, నిత్యావసర సురకులను వీఆర్వో నానాజి గురువారం అందజేశారు. బుధవారం రాత్రి జడ్డంగి పంచాయతీ జమ్మిచావడి గ్రామంలో వేమా పార్వతి వంట చేస్తుండగా ఆమె పూరిల్లు దగ్ధమైన సంగతి తెలిసిందే. ఈ మేరకు సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, కోఆప్షన్ మెంబర్ అడపా కామేష్, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆ కుటుంబాన్ని పరామర్శించి కొంత ఆర్థిక సాయం చేశారు.

బాలరేవులలో కొత్తగా సంత ఏర్పాటు

ప్రారంభించిన ఎంపీపీ రమేష్



పూజలు చేసి సంతను ప్రారంభిస్తున్న ఎంపీపీ

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ బాలరేవులలో గురువారం సంతను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ బడుగు రమేష్ పూజలు చేసి సంతను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రహదారి బాగుపడటంతో బాలరేవుల వరకు వాహనాలు వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. వ్యాపారులు సులువుగా సరకులను తీసుకువచ్చి విక్రయించవచ్చని సూచించారు. ఈ ప్రాంతంలో పది గ్రామాల ప్రజలకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అత్యవసరమైతే తప్ప మండల కేంద్రానికి రావలసిన అవసరం ఉండదన్నారు. ప్రభుత్వం గిరిజన ప్రాంతాలకు ఎక్కువ మేలు చేస్తుందన్నారు. మైదాన ప్రాంతం నుంచి సరకులను తీసుకువచ్చిన వారిని ఎంపీపీ అభినందించారు. కొయ్యూరు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సుమర్ల సూరిబాబు పాల్గొన్నారు.

మలేరియా నివారణ మందు పిచికారీ

ముంచంగిపుట్టు: స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర, బాలికల పాఠశాలల్లో గురువారం కిలగాడ వైద్యాధికారి ఎస్.రమేష్ ఆధ్వర్యంలో మలేరియా నివారణ మందు పిచికారీ చేయించారు. దోమల వల్ల కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాల ఆవరణంలో పారిశుధ్యం మెరుగు, పరిశుభ్రతపై తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని, ఎటువంటి అనారోగ్య సమస్యలున్నా వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుబ్రహ్మణ్యం, అశోక్ పాల్గొన్నారు.

రమణయ్యను పరామర్శించిన ఎమ్మెల్సీ

గంగవరం: తీవ్ర అనారోగ్యానికి గురైన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు ఇరాట రమణయ్యను ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ (బాబు) బుధవారం రాత్రి పరామర్శించారు. పార్టీ నేతలతో కలిసి లొద్దిపాలెంలో రమణయ్య స్వగృహానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబిరత్నం, వైస్ ఎంపీపీలు రామతులసి, గంగాదేవి, కోఆప్షన్ సభ్యుడు ప్రభాకర్, మొల్లేరు సర్పంచ్ కుంజం లక్ష్మి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు ఉన్నారు.

విధి నిర్వహణలో వైద్యుల నిర్లక్ష్యం

రంపచోడవరం: మారేడుమిల్లి ఆర్యోగ కేంద్రానికి వైద్యులు సమయానికి రాకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని బీజేపీ మండల కార్యదర్శి కుంజం స్వామిదొర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీహెచ్‌సీకి వచ్చిన రోగులు రక్తపరీక్షలు చేయించుకుని వైద్యుని కోసం ఎదురు చూడాల్సి వస్తుందని వాపోయారు. సకాలంలో వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

'హెచ్‌ఎంల బదిలీలను రద్దు చేయాలి'

సాక్షి, పాడేరు: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో గత నెలలో నిర్వహించిన హెచ్‌ఎంల బదిలీల్లో పలుచోట్ల అక్రమాలు జరిగాయని, వాటిని వెంటనే రద్దు చేయాలని గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖీ శేషాద్రి గురువారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. అక్రమంగా జరిగిన బదిలీల విషయంలో అధికారులు చర్యలు చేపట్టని పక్షంలో ముఖ్యమంత్రి, ఇతర ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేస్తామన్నారు.

సీఎం దృష్టికి గిరిజనుల సమస్యలు

చింతపల్లి: గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అరకు పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కోరారు. బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలోని వివిధ సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. వీటి పరిష్కారం పట్ల సీఎం సానుకూలంగా స్పందించినట్లు సుధాకర్ తెలిపారు.

జగనన్న సురక్ష సర్వేను విజయవంతం చేయాలి

ఎంపీడీవో లాలం సీతయ్య



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతయ్య

కొయ్యూరు: జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో లాలం సీతయ్య సచివాలయాల సిబ్బందికి సూచించారు. ఆయన గురువారం డౌనూరు, చిట్టింపాడు సచివాలయాలను సందర్శించారు. అక్కడ సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటిని సందర్శించాలన్నారు. అర్హులైతే వారికి పథకాలు ఎందుకు అందలేదో కారణాలు తెలుసుకుని నమోదు చేయాలన్నారు. 11 రకాల సేవలను ఉచితంగా చేస్తున్నామన్నారు. విధుల పట్ల ఎవరూ నిర్లక్ష్యంగా ఉండొద్దన్నారు. ఈవోపీఆర్డీ ఆర్పీ నాయుడు పాల్గొన్నారు.

3, 5, 7 తేదీల్లో..

గంగవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీమన్నారాయణ తెలిపారు. వచ్చే నెల నెల 3న మోహనాపురం, 5న జడేరు, 7న మర్రిపాలెం గ్రామ సచివాలయాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అర్హులైన వారికి 11 రకాల పత్రలు మంజూరు చేస్తామన్నారు.

1 నుంచి 27 వరకు...

వై.రామవరం: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో వచ్చే నెల 1 నుంచి 27వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 17 గ్రామ సచివాలయాల్లో సదస్సుల నిర్వహణకు రెండు బృందాలు ఏర్పాటు చేశామన్నారు. 1న చవిటిదిబ్బల సచివాలయంలోను, 4న పాతకోట, 5న దారగడ్డ, 6న వై.రామవరం, 7న యార్లగడ్డ, 11న దాలిపాడు, 12న దేవరమడుగులు,13న కె.యర్రగొండ, 14న గుర్తేడు, 15న కానివాడ, 18న చింతలపూడి, 19న కోట, 20న పి.యర్రగొండ, 21న పనసలపాలెం, 22న యర్రంరెడ్డిపాలెం, 25న చామగడ్డ, 27న బొడ్డగండి గ్రామ సచివాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆయా తేదీల్లో సచివాలయాల సిబ్బంది, గ్రామ వలంటీర్లు అన్ని సర్వే రికార్డులతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

ప్రధాన రోడ్డుకు అనుసంధానంగా సీసీరోడ్లు

రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జయ్య



సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ మంగా బొజ్జయ్య

రంపచోడవరం: సీసీరోడ్లులకు, ప్రధాన రహదారికి అనుసంధానం కాకపోవడంతో వర్షాకాలంలో అనేక ఇబ్బందులు ఉన్నాయని రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జయ్య తెలిపారు. ఈ మేరకు పంచాయతీ నిధులతో రంపచోడవరంలో ప్రధాన రహదారికి సీసీ రోడ్లులను అనుసంధానం చేసే పనులను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీసీ రోడ్డుకు, ప్రధాన రహదారికి మధ్యలో ఖాళీ ఉండడంతో వర్షాలు పడినప్పుడు గోతులుగా మారి స్థానికులు నడిచేందుకు, వాహనాలు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రామంలో అనేక చోట్ల చిన్న చిన్న సీసీరోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. ఉప సర్పంచ్ వీఎం కన్నబాబు, వార్డు మెంబరు కప్పల వెంకట్రావు పాల్గొన్నారు.

20న ఎస్సీ కమిషన్ దృష్టికి దళిత సమస్యలు

దళిత ఐక్యవేదిక కన్వీనర్ మాదే రామచంద్రరావు



దళిత మహిళలతో మాట్లాడుతున్న మాదే రామచంద్రరావు

రంపచోడవరం: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం విక్టర్ ప్రసాద్ ఏజెన్సీ పర్యటన విజయవంతం చేయాలని దళిత ఐక్యవేదిక కన్వీనర్ మాదే రామచంద్రరావు కోరారు. మండలంలోని నరసాపురంలో దళితులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ వచ్చే నెల 20న రంపచోడవరం వస్తున్న కమిషన్ చైర్మన్‌కు ఏజెన్సీలోని దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను వివరించాలన్నారు. సమస్యలున్న వారంతా చైర్మన్ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఏజెన్సీ ముఖద్వారం గోకవరం మండలంలోని దళితుల సమస్యలతోపాటు ఇతర మండలాల్లో భూ సమస్యలు, నివాస స్థల వివాదాలు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ అమలులో లోపాలపై కమిషన్‌ను ఆశ్రయించాలన్నారు. కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక కమిటీ సభ్యులు బాలు అక్కిన, దండంగి సింహాద్రి, మధు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జేసీఎస్ మండల ఇన్‌చార్జి మరియాదాస్

కూనవరం: వచ్చే నెల మొదటి వారంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్‌ల ఆధ్వర్యంలో కూనవరంలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్, మండల కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, గుజ్జాబాబు కోరారు. గురువారం రేగులపాడు, లింగాపురం, అబిచర్ల, కూటూరు, పెదార్కూరు, చినార్కూరు, కొండాజూపేట పంచాయతీల్లో విస్తృత సమావేశాల్లో వారు మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని, సంబంధిత అధికారుల ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై కూనవరంలో నిర్వహించనున్న బహిరంగ సభకు ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు డీ గంగాధర్, ఏ వెంకట్రామారావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఇంటి పూర్ణానందం, సొసైటీ అధ్యక్షుడు ఎస్ కొండలరావు, సర్పంచ్‌లు సున్నం అభిరామ్, కట్టం లక్ష్మి, నాయకులు దివాకర్, పూర్ణ, పూసం ప్రసాద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



రాజవొమ్మంగి మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



జోలాపుట్టులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రాజవొమ్మంగి: స్థానిక రెహమానియా మసీదులో గురువారం బక్రీద్ పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదు ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీద్ గురువు హుస్సేన్ మాట్లాడుతూ త్యాగానికి ప్రతీకగా బక్రీద్ అన్నారు. ప్రతి ఒక్కరూ మంచి మనసు కలిగి ఉండాలని, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని కోరారు. అనంతరం ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

జోలాపుట్టులో ...

ముంచంగిపుట్టు: జోలాపుట్టు పంచాయతీలో గురువారం ముస్లింలు బక్రీద్ పండగను ఘనంగా నిర్వహించారు. మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ప్రత్యేక విందు ఏర్పాటు చేసి హిందువులను ఆహ్వానించి సత్కరించారు. గురువు జాకీర్ హుస్సేన్, మతపెద్దలు సోలేమాన్, కమ్మిరుద్దీన్, ఇస్మహేల్,రాజ్ శీలర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



కిల్లో పండును పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనంతగిరి: బొర్రా పంచాయతీకి చెందిన కిల్లో పండు, తన కుమారుడు అప్పన్న గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. మండల కన్వీనర్ నవీన్ ద్వారా ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ ఫోరం మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రేగబోయిన స్వామి, పార్టీ నాయకులతో గురువారం వారిని పరామర్శించారు. తండ్రీ కొడుకుల ఆరోగ్య పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ దృష్టికి తీసుకెళ్లి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఏఎంసీ డైరెక్టర్ పార్వతమ్మ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మధుసూదన్, మండల కార్యదర్శి డానియేలు, మన్యం చారిటబుల్ ట్రస్ట్ కోఆర్డినేటర్ రామరాజు పాల్గొన్నారు.